మార్కెట్లోకి స్కోడా కైలాక్

- ధర రూ.7.89 లక్షలు

ముంబై, నవంబర్ 6: చెక్ రిపబ్లిక్‌నకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం స్కోడా ఆటో..దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా నాలుగు మీటర్ల లోపు పొడువు కలిగిన కాంప్యాక్ట్ ఎస్‌యూవీ మాడల్ కైలాక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. ఈ నూతన మాడల్ కోసం డిసెంబర్ 2 నుంచి బుకింగ్‌లు ప్రారంభించనున్న సంస్థ..బుకింగ్ చేసుకున్నవారికి వచ్చే ఏడాది జనవరి 27 నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా స్కోడా ఆటో సీఈవో క్లాస్ జెల్మార్ మాట్లాడుతూ..ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్టైన భారత్‌లో మరింత పాగా వేయడానికి ఈ నూతన మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, అలాగే రెండేండ్లలో 10 వేల యూనిట్ల వార్షిక విక్రయాలు లక్ష్యం చేరుకోవడానికి వీలుపడనున్నదన్నారు. దేశీయంగా అమ్ముడవుతున్న వాహనాల్లో ఎస్‌యూవీల వాటా 50 శాతానికి పైగా ఉంటుంది.

క్యూ2 వృద్ధి 6.5 శాతమే

- దేశ జీడీపీపై ఎస్బీఐ ఎకనామిస్టుల అంచనా

ముంబై, నవంబర్ 6: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో దేశ జీడీపీ వృద్ధి 6.5 శాతానికే పరిమితం కావచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధిరేటు మందగమనంలోకి వెళ్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంగా జీడీపీ గణాంకాలు 7 శాతం దరిదాపుల్లోనే ఉంటాయన్న ఆందోళనను బుధవారం వారు వ్యక్తం చేశారు. తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్‌లోనూ జీడీపీ వృద్ధి 6.7 శాతంగానే ఉందని, ఇది 15 త్రైమాసికాల కనిష్ఠమని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే గతంలో తమ అంచనాల్ని సవరిస్తూ ఈసారి జీడీపీ 7 శాతం దిగువనే ఉండొచ్చన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆర్థిక కార్యకలాపాల ప్రగతిని చూపే 50 సంకేతాల సూచీ ప్రతికూలంగా కనిపిస్తున్నదని, నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 80 శాతంగా ఉంటే, ఈసారి 69 శాతంగానే ఉందని, ఏప్రిల్-జూన్‌లోనూ 78 శాతంగా ఉన్నట్టు ఎస్బీఐ ఎకనామిస్టులు చెప్తున్నారు. వినియోగం, డిమాండ్‌లో తగ్గుదల కనిపిస్తున్నదని.. వ్యవసాయ, పరిశ్రమ, సేవా రంగాల్లోనూ ఆశాజనక పరిస్థితులేవని అంటుండటం గమనార్హం.

భారత్-అమెరికా మైత్రికి దన్ను

ట్రంప్ సర్కారుతో పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం: నాస్కామ్

న్యూఢిల్లీ, నవంబర్ 6: డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన అమెరికాలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నట్టు భారతీయ ఐటీ రంగ సంస్థల సంఘం నాస్కామ్ ప్రకటించింది. అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ట్రంప్‌కు శుభాకాంక్షల్ని కూడా తెలియజేసింది. భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో ఐటీ పరిశ్రమల పాత్ర కీలకమని గుర్తుచేసిన నాస్కామ్.. ఇరు దేశాల మధ్య ప్రగతిదాయక సాంకేతిక భాగస్వామ్యం బలోపేతానికి కృషి చేస్తామంటూ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నది. 254 బిలియన్ డాలర్ల భారతీయ టెక్నాలజీ ఇండస్ట్రీకి అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నది. అమెరికా జీడీపీకి భారత ఐటీ కంపెనీల ద్వారా 80 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతున్నది.

అయ్యయ్యో.. రూపాయే

- ఆల్‌టైమ్ కనిష్ఠానికి కరెన్సీ
- డాలర్ ముందు రుపీ వెలవెల
- 22 పైసలు పడిపోయి 84.31 వద్దకు పతనం
- ట్రంప్ విజయంతో అమెరికా డాలర్‌కు పెరిగిన డిమాండ్



ముంబై, నవంబర్ 6: రూపాయి విలువ భారీగా పతనమైంది. బుధవారం ఒక్కరోజే ఏకంగా 22 పైసలు క్షీణించింది. ఫలితంగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే దేశీయ కరెన్సీ మారకపు రేటు మునుపెన్నడూ లేనివిధంగా 84.31 స్థాయికి దిగజారింది. హోరాహోరీగా జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంతో యూఎస్ డాలర్ ఇండెక్స్ పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే రుపీ విలువ ఆల్‌టైమ్ లో స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో అన్ని ప్రధాన దేశాల కరెన్సీల విలువ ఒక్కసారిగా పెరగడం, మరోవైపు దేశీయ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు ఫారెక్స్ ట్రేడర్లు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. త్వరలో జరుగబోయే ఫెడ్ రిజర్వ్ ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్ల కోతలుంటాయన్న అంచనాలూ దెబ్బతీసినట్టు చెప్తున్నారు. 2025లో 100 బేసిస్ పాయింట్లదాకా వడ్డీరేట్ల తగ్గింపులుం డొచ్చన్న అభిప్రాయాలున్నాయి.

ఒడిదొడుకుల్లో..

దాదాపుగా గత వారం రోజుల నుంచి ఊగిసలాటకు గురువుతున్న రూపాయి మారకం విలువ.. బుధవారం తీవ్ర ఒడిదొడుకులకు లోనైంది. ఉదయం ట్రేడింగ్ ఆరంభంలోనే 14 పైసల నష్టంతో 84.23 వద్ద మొదలవగా, చివరకు 22 పైసల నష్టంతో 84.31 స్థాయికి పడిపోయింది. మధ్యలో 84.15కు కోలుకున్నా నిలదొక్కుకోలేకపోయింది. సోమవారం ముగింపుతో చూస్తే మంగళవారం రుపీ 2 పైసలు బలపడి 84.09 వద్ద నిలిచింది. అయితే ఆ జోష్‌ను కొనసాగించలేకపోయింది. ట్రంప్ గెలుపుతో డాలర్ ఇండెక్స్ 1.34 శాతం ఎగిసి 104.80 వద్దకు చేరింది.

ఆర్బీఐ జోక్యం అవసరం

రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనమైన నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యం లాభించగలదన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆర్బీఐ చర్యలు రుపీ విలువను తిరిగి పెంచగలవని అంటున్నారు. కాగా, గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడులకు రిస్క్ పెరగడం, కమోడిటీ ధరల్లో క్షీణత కూడా రూపాయిని బలపర్చగలదని పేర్కొంటున్నారు.

గల్ఫ్ ఆయిల్ లాభం 84 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 6: హిందుజా గ్రూపునకు చెందిన గల్ఫ్ ఆయిల్ లుబ్రికెంట్స్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.84.44 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.73.66 కోట్ల లాభంతో పోలిస్తే 15 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.86 శాతం ఎగబాకి రూ.802.30 కోట్ల నుంచి రూ.849.33 కోట్లకు చేరుకున్నది.

అపోలో హాస్పిటల్స్ ఆకర్షణీయం

హైదరాబాద్, నవంబర్ 6: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.379 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది అపోలో హాస్పిటల్స్. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.233 కోట్ల లాభంతో పోలిస్తే 63 శాతం వృద్ధిని కనబరిచింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపది కన 15 శాతం ఎగబాకి రూ.5,589 కోట్లకు చేరుకున్నది.

కదంతొక్కిన సూచీలు

- సెన్సెక్స్ 901, నిఫ్టీ 271 పాయింట్ల లాభం
- ట్రంప్ గెలువడంతో ఐటీ, ఫార్మా షేర్లకు కిక్కు
- రెండు రోజుల్లో 10 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, నవంబర్ 6:దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయకేతనం ఎగురవేయడంతో మదుపరుల్లో జోష్ పెంచింది. దేశీయ మదుపరులతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో వరుసగా రెండోరోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఫార్మా రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో సెన్సెక్స్ తిరిగి 80 వేల మైలురాయిని అధిగమించింది. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 901.50 పాయింట్లు లేదా 1.13 శాతం అందుకొని 80,378.13 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 270.75 పాయింట్లు లేదా 1.12 శాతం లాభపడి 24,484.05 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు లాభాల జడివానలో తడిసిముద్దయ్యారు. వరుసగా రెండు రోజులుగా సూచీలు కదంతొక్కడంతో మదుపరుల సంపద రూ.10 లక్షల కోట్లకు పైగా పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.10,47,565.48 కోట్లు పెరిగి రూ.4,52,58,633.53 కోట్లు(5.37 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వరుస సెషన్లలో సెన్సెక్స్ రెండు శాతానికి పైగా లాభపడినట్లు అయింది.

ఐటీ షేర్లలో జోష్

దేశీయ ఐటీ సంస్థల షేర్లు కదంతొక్కాయి. ట్రంప్ గెలువడంతో ఐటీ సంస్థలకు వచ్చిన ఇబ్బందేమి లేదని అంచనాలు నెలకొనడంతో ఈ రంగ షేర్లు నాలుగు శాతం వరకు లాభపడ్డాయి. దీంట్లో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు అత్యధికంగా 4.21 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టెక్ మహీంద్రా 3.85 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 3.71 శాతం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 5.86 శాతం, ఎల్‌టీఐమైండ్‌ట్రీ 4.75 శాతం, విప్రో 3.75 శాతం చొప్పున లాభపడ్డాయి. దీంతోపాటు అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, మారుతి, రిలయన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, టైటాన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్లు నష్టపోయాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలువడంతో అంతర్జాతీయ మార్కెట్లలో రిలీఫ్ ర్యాలీ నడిచిందని, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు తగ్గుముఖం పట్టనుండటం సూచీల్లో జోష్ పెంచాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా చూస్తే ఐటీ అత్యధికంగా 4.04 శాతం లాభపడగా, టెక్ 3.37 శాతం, రియల్టీ 2.68 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.66 శాతం, సర్వీసెస్ 2.53 శాతం, యుటిలిటీ 2.44 శాతం చొప్పున పెరిగాయి.

థార్‌పై 3 లక్షల వరకు రాయితీ

ముంబై, నవంబర్ 6: దేశీయ ఆటో మొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా..పలు మాడళ్లను తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. ఇప్పటికే పలు మాడళ్ల ధరలను తగ్గించిన సంస్థ..తాజాగా థార్ 3-డోర్లు, థార్ రాక్స్ మాడళ్లపై రూ.3 లక్షల వరకు రాయితీతో విక్రయిస్తున్నది. 2 లీటర్ల టర్బో పెట్రోల్, 2.2 లీటర్ల టర్బో డీజిల్ ఇంజిన్‌తో ఈ కారును తయారు చేసింది సంస్థ. రెండు నెలల క్రితం ఈ కారుపై రూ.1.6 లక్షల వరకు రాయితీ ఇచ్చిన సంస్థ..ఈసారికిగాను ఈ డిస్కౌంట్‌ను రెండు రెట్లు పెంచుతూ రూ.3 లక్షల వరకు పెంచింది.

సాయి లైఫ్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, నవంబర్ 6: మరో నాలుగు సంస్థల ఐపీవో ప్రతిపాదనకు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంట్లో హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నది. దీంతోపాటు రుబికాన్ రీసర్చ్, సనాథన్ టెక్స్‌టైల్స్, మెటల్ మ్యాన్ ఆటో కూడా ఉన్నాయి. ఈ నాలుగు సంస్థలు గరిష్ఠంగా రూ.3 వేల కోట్ల వరకు నిధులు సమీకరించనున్నాయి. దీంట్లో రుబికాన్ రీసర్చ్ రూ.1,085 కోట్ల నిధులను సేకరించనుండగా, సాయి లైఫ్ సైన్సెస్ తాజా ఈక్విటీ షేర్లను జారీచేయడం ద్వారా రూ.800 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నది.

హైదరాబాద్‌లో వాయు ఫుడ్ యాప్

హైదరాబాద్, నవంబర్ 6: రాష్ట్ర మార్కెట్లోకి మరో ఫుడ్ ఆధారిత సేవల సంస్థ ప్రవేశించింది. ఇప్పటికే జోమాటో, స్విగ్గీలు సేవలు అందింస్తుండగా తాజాగా 'వాయు' తన సేవలను హైదరాబాద్‌లో ప్రారంభించింది. జీరో కమిషన్ ఫుడ్ డెలివరీ యాప్ సేవలు అందిస్తున్న తొలి సంస్థ వాయు కావడం విశేషం. తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్‌తో కలిసి హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లో ఈ సేవలు అందిస్తున్నట్లు కంపెనీ సీఈవో మందార్ ల్యాండ్ తెలిపారు. ఈ జంటనగరాల్లో ఉన్న 3 వేలకు పైగా హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకొని ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సంస్థ ముంబై, పుణె, జైపూర్, బెంగళూరులో సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.

ముడా స్కామ్‌లో సిద్ధూ విచారణ

రెండు గంటలపాటు ప్రశ్నించిన లోకాయుక్త పోలీసులు.. అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పా: సిద్ధరామయ్య

మైసూరు, నవంబర్ 6: ముడా స్థలాల కేటాయింపు కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను లోకాయుక్త పోలీసులు బుధవారం విచారించారు. ఈ కేసులో సిద్ధరామయ్య ఏ1గా ఉన్నారు. లోకాయుక్త పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు బుధవారం ఆయన విచారణకు హాజరయ్యారు. లోకాయుక్త ఎస్పీ టీజే ఉదేశ్ నేతృత్వంలోని అధికారుల బృందం సిద్ధరామయ్యను రెండు గంటల పాటు విచారించింది. ముడా స్థలాల కేటాయింపులో ఉన్న ఆరోపణలపై ప్రశ్నించింది. తన భార్య పార్వతికి 14 విలువైన స్థలాలను మైసూరు అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(ముడా) కేటాయించడంలో సిద్ధరామయ్య పాత్రపై ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. కాగా, ఈ కేసులో నిందితులుగా ఉన్న సిద్ధరామయ్య సతీమణి పార్వతి, ఆమె సోదరుడు మల్లికార్జున స్వామితో పాటు దేవరాజు అనే వ్యక్తిని ఇప్పటికే లోకాయుక్త పోలీసులు విచారించారు. మైసూరు సమీపంలోని ఓ గ్రామంలో దేవరాజు నుంచి మల్లికార్జున స్వామి భూమిని కొనుగోలు చేసి పార్వతికి బహుమతిగా ఇచ్చారని, తక్కువ విలువైన ఈ భూమిని ముడాకు అప్పగించి, ఖరీదైన 14 స్థలాలను పార్వతి పొందారనే ఆరోపణలతో ఈ కేసు నమోదైంది. కాగా, అసలు ముడాకు అప్పగించిన స్థలం దేవరాజుది కాదని, మల్లికార్జున స్వామి ఈ స్థలాన్ని కొనలేదనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

మైసూర్‌లో లోకాయుక్త కార్యాలయం నుంచి వెళ్లిపోతున్న సీఎం సిద్ధరామయ్య

నాపై తప్పుడు కేసు పెట్టారు: సిద్ధరామయ్య

లోకాయుక్త పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానాలు చెప్పానని సిద్ధరామయ్య పేర్కొన్నారు. విచారణ అనంతరం ఆయన మాట్లాడుతూ... 'ప్రతీది(ముడా స్థల కేటాయింపు) న్యాయబద్ధంగా జరిగింది. బీజేపీ, జేడీఎస్ అబద్ధపు ఆరోపణలు చేస్తున్నాయి. లోకాయుక్త పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాను. నాపై తప్పుడు కేసు పెట్టారు. నేను నిజాలు చెప్పాను. నాపై ఉన్నవి ఆరోపణలు మాత్రమే.' అని పేర్కొన్నారు.

సిద్ధరామయ్య రాజీనామా కోసం ఆందోళన

సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ నేతలు మైసూరులో ఆందోళనకు దిగారు. బీజేపీ ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స నేతృత్వంలో బీజేపీ శ్రేణులు సిద్ధరామయ్య, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కోవాలని శ్రీవత్స డిమాండ్ చేశారు. ఆయన సీఎంగా ఉంటే విచారణ పారదర్శకంగా ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. లోకాయుక్త పోలీసుల తీరుపై అనుమానం వ్యక్తం చేసిన ఆయన ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

కర్ణాటక కాంగ్రెస్ అవినీతిపై కన్నెర్ర

- 20న మద్యం దుకాణాలు బంద్
- వైన్‌మర్చంట్స్ అసోసియేషన్

బెంగళూరు, నవంబర్ 6: వరుస అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తాజాగా మద్యం వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర్ కొన్ని వందల కోట్ల అవినీతికి పాల్పడినట్టు కర్ణాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ (కేడబ్ల్యూఎంఏ) తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ అవినీతి, ఎక్సైజ్ శాఖ అక్రమాలను నిరసిస్తూ ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపులను మూసివేస్తామని ప్రకటించింది. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిన ఎక్సైజ్ శాఖను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేసింది.

700 కోట్ల స్కామ్..

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికి పైగా సీఎల్7 బార్ లైసెన్స్‌లను హోటళ్లు, కొన్ని బోర్డింగ్ గృహాలకు మంజూరు చేసిందని అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామి, ప్రధాన కార్యదర్శి బీ గోవింద్ రాజ్ తెలిపారు. ఒక్కో లైసెన్స్ మంజూరుకు రూ. 30 లక్షల నుంచి 70 లక్షలు లంచంగా తీసుకున్నారని, వాస్తవానికి వీటిని ఏర్పాటు చేయడానికి 4 నుంచి 8.5 లక్షల ఫీజు మాత్రమే వసూలు చేయాలని వారు చెప్పారు. ఇలా రూ. 300 కోట్ల నుంచి 700 కోట్ల వరకు మంత్రి తిమ్మాపుర్ వీటిని వసూలు చేశారని వారు ఆరోపించారు. అంతేకాకుండా ఎక్సైజ్ శాఖలో ఉన్నత స్థానాల్లో బదిలీల కోసం 25 లక్షల నుంచి 40 లక్షల రూపాయలు లంచంగా వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు.

ఎల్ ఎంవీ లైసెన్సుతో కమర్షియల్ వాహనాలు నడపొచ్చు:సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కమర్షియల్ (వాణిజ్య) వాహనాలను నడిపే డ్రైవర్లకు సుప్రీంకోర్టు పెద్ద ఊరట కల్పించింది. లైట్ మోటర్ వెహికల్ (ఎల్ఎంవీ) డ్రైవింగ్ లైసెన్సు ఉన్నవారు 7,500 కిలోల కంటే తక్కువ బరువున్న వాణిజ్య వాహనాలను నడపవచ్చని, అందుకు మరో ప్రత్యేక లైసెన్సు అవసరం లేదని స్పష్టం చేసింది. డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన నిబంధనలపై స్పష్టతనిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం ఈ తీర్పును వెలువరించింది. ఎల్ఎంవీ లైసెన్సు ఉన్నవారు రవాణా వాహనాలను నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమంటూ బీమా కంపెనీలు చేసిన వాదనను తోసిపుచ్చింది. 2017లో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును పూర్తిగా సమర్థిస్తూ.. బీమా కంపెనీల పిటిషన్లను కొట్టివేసింది. మోటరు వాహనాల చట్టం-1988 నిబంధనలు మధ్యస్థ, భారీ వాహనాలతో పాటు 7,500 కిలోల కంటే అధిక బరువున్న ప్రయాణికుల వాహనాలకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేసింది.

నీట్ యూజీ-2024పై రివ్యూ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ, నవంబర్ 6: నీట్-యూజీ 2024 పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలన్న వాదనను సుప్రీంకోర్టు మరోమారు తోసిపుచ్చింది. నీట్ పరీక్షకు సంబంధించి ఆగస్టు 2 నాటి తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇంతకు ముందు ఇచ్చిన తీర్పులో ఎలాంటి లోపాలూ లేవని, తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులో పేర్కొన్నది. అంతేకాదు, ఈ అంశంపై బహిరంగ కోర్టు విచారణ జరపాలన్న విన్నపాన్ని సైతం ధర్మాసనం నిరాకరించింది.

జమ్ముకశ్మీరుకు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

- తీర్మానాన్ని ఆమోదించిన శాసనసభ
- కశ్మీరు పార్టీల మద్దతు..
- నిరసన తెలిపిన బీజేపీ

శ్రీనగర్: జమ్ము కశ్మీరుకు ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని జమ్ముకశ్మీర్ శాసనసభ బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ ప్రత్యేక హోదాను పునరుద్ధరించేందుకు రాజ్యాంగపరమైన యంత్రాంగం కోసం కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, ఏఐపీ, సీపీఎం పార్టీలు ఈ తీర్మానానికి మద్దతివ్వగా, బీజేపీ నిరసన తెలిపింది. సభలో గందరగోళం నెలకొనడంతో చర్చ జరగకుండానే, మూజువాణీ ఓటుతో ఈ తీర్మానం ఆమోదం పొందింది.

అంతర్-జాతీయం

కాలర్ ఐడీ సమాచారాన్ని నమ్మొద్దు ప్రభుత్వ ఉద్యోగులను హెచ్చరించిన కేంద్రం

న్యూఢిల్లీ: ఫోన్ కాల్ రాగానే స్మార్ట్ ఫోన్‌లో కనిపించే కాలర్ ఐడీ సమాచారాన్ని నమ్మొద్దని ప్రభుత్వ ఉద్యోగులను సైబర్ సెక్యూరిటీ అడ్వయిజరీ తాజాగా హెచ్చరించింది. తాను ప్రభుత్వ అధికారినంటూ ఫోన్ కాలర్ చెబితే, గుడ్డిగా నమ్మి.. వాళ్లు అడిగిన సున్నితమైన సమాచారం ఇవ్వొద్దని, కాలర్ ఐడీని వెరిఫై చేసుకోవాలని 'నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్' (ఎన్ఐసీ) తాజాగా తెలిపింది. 'విషింగ్' దాడులు జరిగే అవకాశముందని, దీంతో గోప్యమైన వ్యక్తిగత సమాచారం మోసగాళ్ల చేతిలోకి వెళ్తుందని ప్రభుత్వ ఉద్యోగులకు తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు బుధవారం ఎన్ఐసీ మార్గదర్శకాలు జారీచేసింది.

ప్రతిభ గల విద్యార్థుల కోసం పీఎం విద్యాలక్ష్మి

- ఉన్నత విద్యకు రుణాలు.. 22 లక్షల మందికి లబ్ధి
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబర్ 6: ప్రతిభగల విద్యార్థులకు ఆర్థికంగా సహాయం అందించే పీఎం-విద్యాలక్ష్మి పథకాన్ని కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. నాణ్యత గల ఉన్నత విద్యను కొనసాగించడానికి ఆర్థికపరమైన ఇబ్బందులు అడ్డంకి కారాదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ పథకం కింద ఎవరికైనా నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశం లభిస్తే వారి కోర్సుకు అవసరమైన ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చులకు అవసరమైన పూర్తి విద్యా రుణాన్ని ఎలాంటి హామీ లేకుండా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి పొందవచ్చు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ల ద్వారా నిర్ణయించిన నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థలు (క్యూహెచ్ఈఐ)కు ఈ పథకం వర్తిస్తుంది. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలతో పాటు, నిర్దిష్ట ర్యాంకింగ్స్ పొందిన విద్యాసంస్థల్లో అడ్మిషన్ పొందే విద్యార్థులు ఈ విద్యా రుణ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈ పథకం పరిధిలోకి 860 ఉన్నత విద్యాసంస్థలు వస్తాయని, ప్రతి ఏడాది 22 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉందని ఒక అధికారి తెలిపారు.

ఓసీఐ మిత్రులకు లక్ష ఈ-వీసాలు

న్యూఢిల్లీ: విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు భారత్ 'చలో ఇండియా క్యాంపెయిన్' పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే వరల్డ్ ట్రావెల్ మార్ట్ సందర్భంగా లండన్‌లో ప్రారంభిస్తారు. విదేశాల్లోని భారతీయుల స్నేహితుల కోసం ఉచిత వీసాలను జారీ చేస్తారు. ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డ్‌హోల్డర్‌లకు ఈ సదుపాయం వర్తిస్తుంది. ఒక ఓసీఐ కార్డ్ హోల్డర్ ఐదుగురు విదేశీయులను ప్రత్యేక పోర్టల్ ద్వారా నామినేట్ చేయవచ్చు. ఆ ఐదుగురికి ఎటువంటి రుసుమును వసూలు చేయకుండా ఉచితంగా గ్ర